

‘టీకా’స్త్రం

చిన్నారుల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం మిషన్ ఇంద్రధనస్సు కింద జిల్లాలో వ్యాక్సినేషన్ ప్రారంభించింది.

- 8లో



‘స్పందన’ సమస్యలకు పరిష్కారం

స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	37	27
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

ప్రాంతీయ సమన్వయకర్తగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు, అనంతపురం, హిందుపూర్ జిల్లాల వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రాంతీయ సమన్వయకర్తగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

అభివృద్ధికి సహకరించాలని వినతి



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : జీడీ నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి విన్నవించారు. సోమవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రధానంగా వెదురుకుప్పం మండలంలో డాక్టర్ వైఎస్సార్ డిగ్రీ కళాశాల, ఐటీఐ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు.

ఇకపై ఇంటికే ‘పోషణ’




నాగశైలజ, ఐసీడీఎస్ పీడీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద బాలింతలు, గర్భిణులకు పంపిణీ చేస్తున్న రేషన్ సరుకులను ఇకపై ఇంటికే పంపనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ కిట్‌తోపాటు టేక్ హోమ్ రేషన్ రూపంలో ప్రతి నెలా మొదటి 15 రోజులకు గాను 3 కేజీల బియ్యం, కేజీ పప్పు, అర లీటర్ ఆయిల్, 2 కేజీల జొన్నపిండి లేదా రాగిపిండి, కేజీ అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరాలు , 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు అందించనున్నట్లు వివరించారు. తర్వాత 15 రోజులకు 12 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులను బాలింతలు, గర్భిణులు మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పీడీ నాగశైలజ తెలిపారు. బాలింతలకు ముర్రుపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

వరసిద్ధుని హుండీ ఆదాయం రూ.1.33 కోట్లు



హుండీ లెక్కింపును పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి, వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా 16 రోజులకు గాను రూ.1.33 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సోమవారం తెలిపారు.

3న జిల్లాకు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 3న జిల్లా పర్యటనకు రానున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ చైర్మన్ గురువారం ఉదయం 10.30 గంటలకు కుప్పం చేరుకుని విలేకరులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు వెల్లడించారు.

అన్నదాతకు ప్రభుత్వం అన్నివిధాల అండగా నిలుస్తోంది.. వ్యవసాయాన్ని పండుగలా మారుస్తోంది.. పెట్టుబడికి ‘భరోసా’ కల్పిస్తోంది.. ఆర్‌బీకేల ద్వారా తోడ్పాటును అందిస్తోంది.. సకాలంలో నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేస్తోంది.. అవసరాలకు తగ్గట్టు ఎరువులు అందజేస్తోంది.. పంటకు గిట్టుబాటు ధర దక్కించేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. పంట ఉత్పత్తులను సేకరించి యంత్రాల సాయంతో గ్రేడింగ్ చేయిస్తోంది.. ప్రాసెసింగ్ అనంతరం పక్కాగా ప్యాకింగ్ చేసి మరీ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తోంది. ఎలాంటి కమీషన్ లేకుండా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది.

ఆరుగాల కష్టం తీరేలా.. ఆదాయం పొందేలా!



గంగవరం మండలంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్



పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేసే యంత్రాలు

- అన్నదాతకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ప్రారంభం
- పంట ఉత్పత్తుల సేకరణ, గ్రేడింగ్, మార్కెటింగ్ సౌకర్యం
- ధర లేనప్పుడు శీతల గిడ్డంగుల్లో భద్రపరుచుకునే అవకాశం

పలమనేరు : వ్యవసాయంలో నష్టాలను నివారించడమే కాకుండా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలోని మూడు మండలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను ప్రారంభించింది. ఉత్పత్తులు నాణ్యంగా ఉండేలా గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి విక్రయించేలా చర్యలు చేపట్టింది. ధర లేని సమయాల్లో రైతులు శీతల గిడ్డంగుల్లో భద్రపరుచుకునే వెసులుబాటు కల్పిస్తోంది. కొత్తగా నిర్మించిన టమాటా విలువ ఆధారిత ప్రాసెసింగ యూనిట్ల ద్వారా 60 మందికి ఉపాధి లభిస్తోంది. 2,500 మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. ముఖ్యంగా కూరగాయలు పండించే రైతాంగం హర్షాతిరేకం వ్యక్తం చేస్తోంది.

కూరగాయల సాగుకు కేరాఫ్ పలమనేరు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో కూరగాయల పంటలు ఎక్కువగా సాగవుతున్నాయి. ముఖ్యంగా సీజన్‌తో సంబంధం లేకుండా టమాటాను ఏడాది పొడవునా సాగు చేస్తుంటారు. ప్రస్తుతం టమాటా 4,500 హెక్టార్లు, బంగాళాదుంప 400, క్యాబేజీ 300, బీన్సు 700, క్యారెట్, బీట్‌రూట్ తదితర పంటలు 50 హెక్టార్లలో సాగవుతోంది.

రూ.16.5కోట్లతో మూడు యూనిట్లు

ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఆపరేషన్ గ్రీన్స్ ప్రోగ్రాం ద్వారా ఎంఓఎఫ్‌పీఐ (మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రైమరీ ఇండస్ట్రీస్) రాష్ట్రంలో రూ.1,719 కోట్లతో 11 ఆహారశుద్ధి పరిశ్రమలను నెలకొల్పుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఆరు యూనిట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల వర్చువల్‌గా ప్రారంభించారు. అందులో టమాటా విలువ ఆధారిత పరిశ్రమలు మూడు మన జిల్లాలోనే కావడం విశేషం. పలమనేరు రెవిన్యూ డివిజన్‌లోని గంగవరం మండలం అటుకురాళ్లపల్లె, బైరెడ్డిపల్లిల్లె మండలం చప్పిడిపల్లె, సోమల మండలం కామిరెడ్డివారిపల్లెలో రూ.16.5 కోట్ల వ్యయంతో నిర్మించారు. ప్రస్తుతం అటుకురాళ్లపల్లె యూనిట్‌లో సేవలు మొదలు కాగా మిగిలిన యూనిట్లు త్వరలో సేవలు ప్రారంభించనున్నాయి.

లాభాలు అధికం

యూనిట్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా వారు పండించిన పంటలను నమోదు చేసుకుంటారు. పలు రాష్ట్రాలకు చెందిన బహుళజాతి సంస్థలు, హోటళ్లు, మాల్స్, కార్పొరేట్ కళాశాలల హాస్టళ్లు, క్యాంటీన్లు, ఇతర కంపెనీలకు అవసరమైన కూరగాయల ఇండెంట్‌ను సేకరిస్తారు. ఆ మేరకు ఇక్కడి రైతుల ఉత్పత్తులను సేకరిస్తారు. యంత్రాల ద్వారా గ్రేడింగ్ చేసి, ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసి కొనుగోలు దారులకు చేరవేస్తారు. సరుకు నాణ్యంగా ఉంటుంది కాబట్టి రైతులకు మంచి ధర దక్కుతుంది. కమీషన్ లేకుండానే రైతులకు నగదు చెల్లిస్తారు. ప్రస్తుతం అటుకురాళ్లపల్లె యూనిట్‌లో టమాటా, బంగాళాదుంప, ఆనియన్, బీట్‌రూట్ తదితర ఉత్పత్తుల ప్రాసెసింగ్ సాగుతోంది.

శీతల గిడ్డంగుల్లో నిల్వ

టమాట, బంగాళాదుంప, చింతపండు తదితర పంటలకు ధర లేనపుడు వాటిని కోల్డ్ స్టోరేజీ గోదాముల్లో నిల్వ చేసుకునే సదుపాయాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో కల్పించారు. నామమాత్రపు రుసుముతోనే రైతులు తమ పంటను నిల్వ చేసుకోవచ్చు. అనుకూలమైన ధర వచ్చినప్పుడు పంటలను విక్రయించుకోవచ్చు.

అందుబాటులో సేవలు



ప్రాసెసింగ్ యూనిట్‌లో రైతులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉన్నాయి. కూరగాయలను సేకరించి గ్రేడింగ్, ప్యాకింగ్ చేస్తున్నాం. పలు కంపెనీల నుంచి మాకు ఆర్డర్లు ఉన్నాయి. ఆ కంపెనీలకు కూరగాయలను అమ్మి కమీషన్ లేకుండా మంచి ధరతో అన్నదాతల ఖాతాల్లో నగదును ఎప్పటికప్పుడు జమ చేస్తున్నాం. ఈ యూనిట్ కారణంగా రైతులకు మేలు జరుగుతోంది.

– నాగరాజు, ఎఫ్‌పీఓ మార్కెటింగ్ మేనేజర్, అటుకురాళ్లపల్లె యూనిట్

నెలకు రూ.లక్ష వస్తోంది



పలమనేరులోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తూ సేద్యంపై మక్కువతో ఉద్యోగం వదులుకున్నా. మా పొలంలో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నా. వీటిని ప్రాసెసింగ్ యూనిట్‌కు పంపి వారి ద్వారా కార్పొరేట్ కంపెనీలకు నా సరుకు వెళుతోంది. దీంతో ప్రతినెల రూ.లక్ష వరకూ వస్తోంది. నాలాగే రైతులు తమ పంట ఉత్పత్తులను ప్రాసెసింగ్ యూనిట్లకు పంపి మంచి లాభాలను పొందవచ్చు.

– రాజేష్, రైతు, జల్లిపేట, పలమనేరు మండలం



కూరగాయలను ట్రేలలో వేస్తున్న కార్మికులు



షేడ్‌నెట్‌లో టమాటా సాగు



పంటల ఉత్పత్తులను నిల్వ చేసే శీతల గిడ్డంగి

త్వరలోనే కుప్పానికి సాగు..తాగునీరు





మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి , వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు (ఇన్‌సెట్) భూమిపూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా ప్రారంభిస్తాం
- 5 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టీకరణ
- పుంగనూరులో రూ.62 కోట్ల పనులకు శంకుస్థాపన


పుంగనూరు : జిల్లాలోని పడమటి నియోజకవర్గాలకు గండికోట జలాలను తరలించేందుకు శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడి రామచంద్రారెడ్డి తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా కుప్పం నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించనున్నట్లు వెల్లడించారు. సోమవారం పుంగనూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా రూ.41కోట్లతో ఎంబీటీ రోడ్డు విస్తరణ, రూ.22కోట్లతో కౌండిన్య కాలువల్లో పూడిక తీసి సిమెంట్ కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలిసి మీడియాతో మాట్లాడారు. పుంగనూరులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి రూ.13 కోట్లతో పైపులైన్లు వేసి, ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని తరలిస్తామన్నారు. అలాగే నెడ్‌క్యాప్ ద్వారా 5 మెగా వాట్‌ల సోలార్ ప్రాజెక్టును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసి, మున్సిపాలిటీకి విద్యుత్ సరఫరా చేయనున్నట్లు వివరించారు. దీంతో మున్సిపాలిటీకి ఏటా రూ. 4కోట్లు ఆదా అవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుంగనూరుపై ప్రత్యేక అభిమానంతో కోట్లాది రూపాయలు మంజూరు చేశారని వెల్లడించారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులను ఐదు నెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసినా చంద్రబాబు కుప్పానికి తాగునీరు అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. నాలుగున్నరేళ్లలోనే సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో కృషి చేసి హంద్రీ-నీవా పనులను పూర్తి చేయిస్తున్నారని వెల్లడించారు. మారుమూల గ్రామాలకు సైతం గండికోట జలాలను తీసుకెళతామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పేదల జోలికి వస్తే సహించం

పట్టణంలోని నక్కబండలో సోమవారం నిర్వహించిన వార్డు బాటలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా సరే పేదల జోలికి వెళ్లితే సహించేది లేదని తెలిపారు. నక్కబండకు త్వరలోనే డబుల్ రోడ్డును వేయిస్తామని, దొంగ పట్టాలపై విచారణ చేయిస్తామని భరోసా ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం కోసం రూ.8.34 కోట్లు కేటాయించామన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటల చెప్పేవారిని నమ్మవద్దని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

పుంగనూరుకు చెందిన 22 మంది టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో సైఫుల్లా, సయ్యద్, షబ్బీర్, బావాజాన్, నిస్సార్, మహబూబ్, యూనస్, కరీముల్లా, రాంబాబు, మల్లికార్జున , న్యామతుల్లా, మహేష్, గణపతి, అల్తాఫ్, నౌషాద్, అహమ్మద్, నజీర్, మహమ్మద్ తదితరులకు మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్‌షరీఫ్ పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన సైఫుల్లా తదితరులు

క్రికెట్ టోర్నీ విజేత టాస్క్‌ఫోర్స్ పోలీసు జట్టు



ట్రోఫీ అందుకుంటున్న టాస్క్‌ఫోర్స్ పోలీసు జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీవీకేఎన్ మైదానంలో నిర్వహించిన పీఎల్ఆర్, వీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సత్తా చాటి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి చేతుల మీదుగా సోమవారం ట్రోఫీ, రూ.2 లక్షల నగదు బహుమతిని అందుకున్నారు. విజేత జట్టును పలువురు క్రీడాకారులు అభినందించారు.

పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ : ఉమ్మడి జిల్లాలోని పలు పెట్రోల్ బంకుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈశ్వరరెడ్డి, లీగల్ మెట్రాలజీ అధికారులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. భద్రతా ప్రమాణాలు, ఇంధన నాణ్యత, కొలతలు, ధరలను పరిశీలించారు. నగరి, పచ్చికాపల్లంలోని రెండు పెట్రోల్‌బంకుల్లో కొలతల తేడా ఉన్నట్లు గుర్తించారు. నిర్వాహకులకు స్టాప్ సేల్ ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓగా విజయబాబు

చిత్తూరు రూరల్ : డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓగా విజయబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప రిమ్స్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన చిత్తూరుకు వచ్చారు.

అభివృద్ధి పనులపై 4 నుంచి సమీక్షలు



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : నియోజకవర్గాల వారీగా అభివృద్ధి పనులపై ఈ నెల 4వ తేదీ నుంచి జిల్లా ఇంచార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ అధ్యక్షతన సమీక్షలు నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ 4 న ఉదయం 10 గంటలకు కుప్పం, మధ్యాహ్నం 3 గంటలకు పుంగనూరు, 11వ తేదీ ఉదయం 10 గంటలకు పలమనేరు, మధ్యాహ్నం 3 గంటలకు చిత్తూరు, 24వ తేదీన ఉదయం 10 గంటలకు పూతలపట్టు, మధ్యాహ్నం 3 గంటలకు గంగాధరనెల్లూరు నియోజకవర్గాలో సాగుతున్న అభివృద్ధి పనులను మంత్రి సమీక్షించనున్నట్లు వివరించారు. ఈ మేరకు అధికారులు నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రజలు అందించిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీసేవా సర్వీసులు, ఓటీఎస్‌కు సంబంధించి ఫీజులను వెంటనే జమచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. జగనన్న సురక్షలో చిత్తూరు మున్సిపాలిటీ, బైరెడ్డిపల్లె, జీడీ నెల్లూరు మండలాలు మొదటి స్థానంలో ఉన్నాయన్నారు. ఇదే స్ఫూర్తితో అందరూ జిల్లాను ముందంజలో నిలిపేందుకు పనిచేయాలని కోరారు. సమీక్షలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీడీలు గంగాభవానీ, పద్మనాభం, ఎస్ఈలు శంకరబాబు, చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఓ ఉమాదేవి, డీపీఓ లక్ష్మీ, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్: జిల్లాలో మంగళవారం నుంచి రేషన్ సరుకులు పంపిణీ ప్రారంభించనున్నట్లు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 1,339 చౌకదుకాణాలకు 5,31,019 కార్డుదారులకు గాను 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యంతోపాటు, చక్కెర, కందిపప్పు, రాగులు సరఫరా చేశామన్నారు. రేషన్ పంపిణీ వాహనాల ద్వారా కార్డుదారులు ఇంటి వద్దే సరుకులు పొందవచ్చని సూచించారు.

కానిస్టేబుల్‌కు అభినందన



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రఘురామ్

చిత్తూరు రూరల్: పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రఘురామ్‌ను ఒడిశా రాష్ట్రం మల్కన్ గిరి జిల్లా ఎస్పీ నితేష్ వాద్వానీ అభినందనలు తెలిపారు. మల్కన్ గిరి స్టేషన్ పరిధిలో మోస్ట్ వాంటెడ్‌గా నమోదైన తిరుపతికి చెందిన ప్రసాద్, రమేష్ అనే నిందితులను అరెస్ట్ చేయడంతో రఘురామ్ సహకరించారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన పంపిన ప్రశంసాపత్రాన్ని సోమవారం చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి చేతులమీదుగా రఘురామ్ అందుకున్నారు.

క్లుప్తంగా

రైలు పట్టాలపై రెండు మృతదేహాలు

చిత్తూరు కార్పొరేషన్ : వేర్వేరు చోట్ల రైలు పట్టాలపై గుర్తుతెలియని రెండు మృతదేహాలు లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ముత్తిరేవుల రైల్వే గేటు సమీపంలో పట్టాల మీద పురుషుడి మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడి ఒంటిపై నలుపు రంగు షర్టు, చేతిపై మెస్సీ అనే రబ్బరు బ్యాండు ఉందని వెల్లడించారు. అలాగే సిద్ధంపల్లె రైల్వేస్టాపింగ్ సమీపంలో మరో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతుడి ఒంటిపై పసుపు కలర్ షర్ట్, నల్లపు రంగు జీన్స్ ప్యాంట్ ఉందని వివరించారు. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

టీకాస్త్రం

పసిబిడ్డల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. చిన్నారుల్లో రోగనిరోధకశక్తిని పెంచేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో పకడ్బందీగా మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అప్పుడే జన్మించిన శిశువు నుంచి పదేళ్ల పిల్లల వరకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది. ఈ క్రమంలోనే గర్భిణులకు సైతం వ్యాక్సిన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వందశాతం వ్యాక్సినేషనే లక్ష్యంగా వైద్యసిబ్బందికి దిశానిర్దేశం చేసింది. ప్రాణాంతక వ్యాధుల నుంచి పసివాళ్లకు రక్షణ కల్పించేందుకు చిత్తశుద్ధితో శ్రమిస్తోంది.

- చిన్నారుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు
- గర్భిణులు.. శిశువులకు ఉచితంగా వ్యాక్సిన్లు
- వైద్యసిబ్బందికి పక్కాగా లక్ష్యాలు
- పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తున్న ప్రభుత్వం
- వందశాతం పూర్తి చేసేలా దిశానిర్దేశం



పిల్లలకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

చిత్తూరు రూరల్ : జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రి, ఏరియా హాస్పిటళ్లలో ప్రతి రోజూ ఉచితంగానే టీకాలు వేస్తున్నారు. అలాగే ఆరోగ్యకేంద్రాల్లో ప్రతి బుధవారం, శనివారం వాక్సినేషన్ డే చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు వారి పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి గర్భిణుల, చిన్నారులకు టీకాలు వేస్తున్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు సైతం ఎప్పటికప్పుడు అవసరాలకు తగ్గట్టు వ్యాక్సిన్లను ఆరోగ్య కేంద్రాలకు చేరుస్తున్నారు. వీటిని నిల్వ చేసుకునేందుకు వీలుగా రిఫ్రిజిరేటర్లను సైతం ఆరోగ్య కేంద్రాల్లో సమకూర్చారు. అప్పుడు పుట్టిన బిడ్డ నుంచి పదేళ్ల పిల్లల వరకు వందశాతం వ్యాక్సినేషనే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

చిన్నారుల్లో తలెత్తే వ్యాధులు

చిన్నపిల్లలకు సకాలంలో టీకా వేయించకుంటే పలు వ్యాధుల బారిన పడే ప్రమాదముంటుంది. ముఖ్యంగా ధనుర్వాతం, క్షయ, కోరింత దగ్గు, పోలియో, హెపటైటిస్-బి, చికెన్ ఫాక్స్, గవద బిళ్లలు, రేచీకటి వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ తరుణంలో టీకాలు శ్రీరామరక్షగా ఉంటాయి. గతంలో టీకా వేస్తున్నారని తెలిస్తే పిల్లలు పాఠశాలలకు వెళ్లేవారే కాదు. అవగాహన లేక తల్లులు కూడా పిల్లలకు టీకాలు వేయించేవారు కాదు. అపోహలు తొలగించడంలో అధికారులు, వైద్యసిబ్బంది సఫలం కావడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు టీకాలు వేయించడానికి ముందుకు వస్తున్నారు.

వందశాతమే లక్ష్యం

జిల్లాలో వ్యాక్సినేషన్‌ను వందశాతం పూర్తి చేయాలని వైద్యఆరోగ్యశాఖ సంకల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా మిషన్ ఇంద్రధనస్సును చేపట్టింది. ఆగస్టు 7 నుంచి అక్టోబరు 14 వరకు మూడు విడతల్లో వ్యాక్సినేషన్‌కు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా జిల్లాలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. 16 ఏళ్లలోపు వారికి ఎన్ని టీకాలు వేయించారు? గర్భిణులకు వ్యాక్సినేషన్ జరిగిందా? తదితర వివరాలు ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. మొత్తం 612 సచివాలయ పరిధిలోని 4,39,858 కుటుంబాలను సందర్శించగా..2, 678 మంది టీకాకు దూరంగా ఉన్నట్లు గుర్తించారు. వీరికి మొదటి విడతగా ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు, రెండో విడతలో సెప్టెంబరు 11 నుంచి 16, మూడోవిడతలో అక్టోబరు 9 నుంచి 14 వరకు టీకాలు ఇవ్వనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం (యూఐపీ) యూవిన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఎప్పుడు ఎవరికి టీకా ఇచ్చారు? తిరిగి మళ్లీ ఎప్పుడు వేయాలి? తదితర వివరాలు పూర్తిగా నమోదు చేయనున్నారు. టీకా పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలను సైతం అందించనున్నారు.

ఉచితంగానే..

చిన్న పిల్లలకు టీకాను ప్రభుత్వం ఉచితంగానే అందిస్తోంది. అదే ప్రైవేటు ఆస్పత్రుల్లో తొలి డోస్‌కు రూ. 800 వరకు ఖర్చవుతోంది. 10 వారాలకు ఇచ్చే పెంటావాలెంట్, రోటా తదితరాలకు కంపెనీని బట్టి రూ. 7 వేల నుంచి రూ. 9 వేలకు వెచ్చించాల్సి వస్తుంది. 14 వారాలు, 19 వారాల్లో కూడా ఇదే రకంగానే టీకాకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. అయితే మిషన్ ఇంద్రధనస్సు కింద గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది.

జిల్లా సమాచారం	
జిల్లా ఆస్పత్రి	01
ఏరియా హాస్పిటళ్లు	04
పీహెచ్‌సీలు	50
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	08
పట్టణ ఆరోగ్య కేంద్రాలు	14
జీరో వయసు శిశువులు	32,032
2 ఏళ్ల పిల్లలు	31,871
2- 3 వారు	31,712
3-4	31,633
4-5	32,416
10	36,310
16 ఏళ్లవారు	40,938

పిల్లలకు వ్యాక్సినేషన్ ఇలా..

- శిశువు జన్మించిన సమయంలో బీసీజీ, ఓపీవీ-జీరో మోతాదు, హెపటైటిస్-బి
- ఆరు వారాలకు ఓపీవీ-1వ డోసు , పెంటావాలెంట్-1, రోటా-1, ఎఫ్ఎల్‌పీవీ-1, పీసీవీ-1
- 10 వారాలకు ఓపీవీ-2, పెంటావాలెంట్-2, రోటా-2
- 14 వారాలకు ఓపీవీ-3, పెంటావాలెంట్-3, రోటా-3, ఎఫ్ఎల్‌పీవీ-2, పీసీవీ-2
- 9 నెలలకు మీజిల్స్-1/ఎంఆర్-1, విటమిన్-ఎ, జేఈ-1, పీసీవీ-బి-16
- 24 నెలల్లో డీపీటీ మొదటి బూస్టర్ డోసు, ఓపీవీ బూస్టర్ డోసు, మీజిల్స్-2/ఎంఆర్-2, జేఈ-2
- 5 నుంచి ఆరేళ్లకు డీపీటీ రెండో బూస్టర్ మోతాదు
- 10, 16వ సంవత్సరంలో టీడీ వ్యాక్సిన్

నిర్లక్ష్యం వద్దు



“ పిల్లల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. బిడ్డకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదు.. ఏ టీకా దేనికి ఇచ్చారు, మళ్లీ ఎప్పుడు రావాలి, వేసిన టీకాను కార్డులో నమోదు చేశారా? తదితర విషయాలను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. కార్డును భద్రపరుచుకోవడం, నెలసరి బరువు చెక్ చేసుకోవడంతోపాటు వైద్యుల సలహాలు విధిగా పాటించాలి. ప్రతి టీకాకు చిన్నచిన్న సైడ్ ఎఫెక్ట్‌లు ఉంటాయి. వైద్యులను అడిగి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. – డాక్టర్ రవిరాజు, డీఐఓ, చిత్తూరు



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

చిత్తూరు అర్బన్: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతం కారణంగా సోమవారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాలు.. చిత్తూరులోని సీబీ రోడ్డుకు చెందిన దివ్యాంగుడు గణేష్(42) ఆదివారం ఉదయం సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా స్విచ్‌బోర్డులోని విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టడంతో వెనక్కి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం తగలడంతో గణేష్ తండ్రి వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యుల సూచన మేరకు తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ మరణించాడు. వన్‌టౌన్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుడిపాల మండలం కిల్లారిపల్లెకు చెందిన శివ (31) తాపీమేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మిట్టూరులోని ఓ భవనంలో పనిచేస్తున్న శివ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వన్‌టౌన్ ఎస్ఐ భారతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్, సీబీఏ- 1 పరీక్షలు



డీసీఈబీ సెక్రటరీ హేమారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు ఫార్మేటివ్, సీబీఏ-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ(డీసీఈబీ) హేమారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 1 నుంచి 8వ తరగతులకు ఓఎంఆర్ బేస్డ్‌లో, 9, 10 తరగతులకు పాత విధానంలో పరీక్షలు జరుగుతాయన్నారు. కొత్తగా అమలు చేస్తున్న టోఫెల్ పరీక్ష నిర్వహణపై టీచర్లకు అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. సీబీఏ విధానాన్ని విద్యార్థులు అర్థం చేసుకునేలా బైలింగ్వల్ (తెలుగు, ఇంగ్లిష్) లో ప్రశ్నపత్రం రూపొందించారన్నారు. ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని నిర్వాహకులు ప్రశ్నపత్రాల కోసం 1 నుంచి 5 వ తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి రూ.150, 6 నుంచి 10 వ తరగతి వరకు రూ.200 చెల్లించాలని సూచించారు. సెక్రటరీ, డీసీఈబీ, చిత్తూరు (ఐఎఫ్ఎస్‌సీ:ఎస్‌బీఐ000085) పేరుతో డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు.

‘స్పందన’ సమస్యలకు సత్వర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన కార్యక్రమంలో ప్రజలు అందించే సమస్యల వినతులను నిర్ణీత గడువులోపు సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ స్పందనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. వినతులను ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 274 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 30 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: స్పందన ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లాలోని పోలీస్‌స్టేషన్ అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి ఫిర్యాదు స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పోలీస్ స్పందనకు మొత్తం 30 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

భార్యను నరికి చంపిన భర్త

చిత్తూరు అర్బన్ : నగరంలోని సాంబయ్యకండ్రిగలో ఆదివారం రాత్రి సుకన్య(38) అనే మహిళను ఆమె భర్తే కత్తితో నరికిచంపాడు. వివరాలు.. తమిళనాడు చెన్నైకు చెందిన సుకన్యకు తన మొదటి భర్తతో విభేదాలు రాడంతో ఆరేళ్ల క్రితం తంజావూరు జిల్లా పుదుకోట్టైకు చెందిన తమిళ్‌కుమార్‌ను పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే తమిళ్‌కుమార్‌కు అప్పటికే వివాహమై భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో సుకన్య బంధువులు సాంబయ్యకండ్రిగలోని ఇటుకల బట్టీలో పనిచేస్తున్నారు. వారు ఆమెను కూడా ఇటుకల బట్టీలో పనిచేసుకునేందుకు పిలిచారు. దీంతో వారం క్రితం సుకన్య, తమిళ్‌కుమార్ తమ పిల్లలతో కలిసి చిత్తూరుకు వచ్చేశారు. ఆదివారం రాత్రి సుకన్య తమ పిల్లలను బంధువుల ఇంట్లో పడుకోబెట్టింది. భర్తతో కలిసి ఇటుకల బట్టీ వద్ద ఓ ఖాళీ గదిలో నిద్రించేందుకు వెళ్లింది. ఆ సమయంలో డబ్బుల కోసం సుకన్యతో ఆమె భర్త గొడవపడ్డాడు. ఆగ్రహం పట్టలేక కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సుకన్య అక్కడికక్కడే మరణించింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాడీ బిల్డింగ్‌లో పుత్తూరు యువకుడి ప్రతిభ



షీల్డ్‌తో నాగూరు

పుత్తూరు రూరల్: సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో పుత్తూరుకు చెందిన నాగూర్ అనే యువకుడు సత్తా చాటాడు. చెన్నై ఆవడిలో సోమవారం జరిగిన పోటీల్లో 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుంచి 36 మంది యువకులు 60 కేజీల కేటగిరి కింద పోటీపడ్డారు. ఇందులో పుత్తూరు రెడ్డిగుంట వీధికి చెందిన నాగూర్ మంచి ప్రతిభ కనబరచడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఏడుగురు ఎర్రదొంగల అరెస్ట్



పట్టుబడిన దుంగలు, వాహనాలతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఐరాల: మండలంలోని ఐరాల, పాటూరు రహదారిపై సోమవారం చేపట్టిన వాహన తనిఖీల్లో ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నిందితుల నుంచి తొమ్మిది ఎర్రచందనం దుంగలు, ఓ కారు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సోమల మండలానికి చెందిన శ్రీనివాసులు,ఎర్రబ్బ, చిరంజీవి, అన్నమయ్య జిల్లాకు చెందిన మణి, తిరుపతికి చెందిన గురుమూర్తి, బంగారుపాళ్యానికి చెందిన వెంకటేశులు, చిత్తూరుకు చెందిన పాండ్యయన్‌ను నిందితులుగా గుర్తించినట్లు వివరించారు. ఐరాల మండలంలోని గోవిందరెడ్డిపల్లె నుంచి దుంగలను తీసుకువచ్చి చిత్తూరుకు చెందిన వినోద్ అనే వ్యక్తి ద్వారా విక్రయించేందుకు యత్నించినట్లు తెలిపారు. సీజ్ చేసిన ఎర్రచందనం దుంగలు, కారు, బైక్ విలువ రూ.19 లక్షలు ఉంటుందని వెల్లడించారు.

చెరువులో మహిళ మృతదేహం



లావణ్య (ఫైల్)

చిత్తూరు అర్బన్: నగరంలోని దుర్గానగర్ కాలనీ చెరువులో సోమవారం ఉదయం ఓ మహిళ మృతదేహం తేలింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కుళ్లిన స్థితిలోని మృతదేహాన్ని బయటకుతీసి విచారణ చేపట్టారు. ప్రాథమికంగా మృతురాలు దుర్గానగర్ కాలనీకు చెందిన లావణ్య (30)గా గుర్తించారు. టూటౌన్ సీఐ మద్దయ్య కథనం మేరకు.. నగరంలోని గిరింపేటలో వడ్డెర పనిచేసే కుమార్ (36), దుర్గానగర్ కాలనీకు చెందిన లావణ్యను ప్రేమించి ఆర్నెళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. లావణ్య తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో అమ్మమ్మ శాంతి వద్ద పెరిగింది. ఈ క్రమంలో శాంతికి దుర్గానగర్‌లో ఓ ఇల్లు ఉంది. దీన్ని తన పేరిట రాయించుకోవాలని కుమార్ గొడవ చేస్తూ తరచూ లావణ్యను కొట్టేవాడు. ఈనెల 27వ తేదీ సైతం లావణ్యతో గొడవ పడిన కుమార్, రాత్రి 10.30 గంటల సమయంలో ఆమెను తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని గిరింపేటకు బయలుదేరాడు. దుర్గానగర్ చెరువు వద్ద ద్విచక్రవాహనం ఆపి మళ్లీ లావణ్యపై దాడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన లావణ్య పక్కనే ఉన్న చెరువులో దూకేసింది. భార్య చెరువులో దూకగానే కుమార్ ద్విచక్రవాహనం తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తీరా మృతదేహం చెరువులో బయటపడటంతో కుమార్‌ను పోలీసులు తమదైన శైలిలో విచారించగా అసలు విషయం చెప్పాడు. నిజంగానే లావణ్య చెరువులో దూకేసిందా..? భర్తే కొట్టి చెరువులో పడేశాడా..? అనే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.